# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా. ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# పడమటి ప్రయాణం

అమెరికన్ కాన్సులేట్ భవనం. ఎత్తుగ్గా, హుందాగా ఉన్న ఆ భవనాన్ని చూస్తుంటేనే ఆవిడకి ముచ్చెమటలు పడుతున్నాయి. ఆవిడ వయసు దాదాపు అరవై ఐదు ఉండవచ్చు. ఆకుపచ్చని గుంటూరు జరీ చీరా, ఎర్రటి జాకెట్టు వేసుకుంది. కొద్దిగా వణుకుతున్న చేతిలో అమెరికానించి కొడుకు పంపిన కాగితాలు, జేబురుమాలు పట్టుకుని 'తననెప్పుడు లోపలకి పంపిస్తారా? 'అని ఆ కార్యాలయం ముందు వేచి ఉంది.

విజయవాడా, మచిలీపట్నాల మధ్యనున్న పామర్రు కు దగ్గరలోని పల్లెటూరు ఆవిడది. అక్కడే పుట్టడం, మేనమామతో వివాహం, ఎప్పుడో ఒకటి రెండు సార్లు తప్ప ఆవిడ పెద్దగా ప్రయాణాలు చేసింది లేదు. అదీ కాక, విజయవాడ దుర్గమ్మ దర్శనానికి తప్ప, ఆవిడ మరే ఇతర దూరప్రయాణం చేసినా సరే ఏదో ఒక ఉపద్రవం జరగడమూ, తద్వారా ఆవిడ ఇబ్బంది పడడమూ జరగడంతో తనకి దూరప్రయాణాలు అచ్చిరావనే నమ్మకం ఆవిడకి. చివరికి అంతా బాగా జరిగినా సరే ఆ భయం ఇప్పటికీ పోలేదు. అందుకే కొడుకు మరీ మరీ రమ్మన్నా సరే "వద్దులేరా అయ్యా, నువ్వొస్తానే ఉన్నావు కదా, ఇంకా నేనెందుకక్కడకి?" అని ఎన్నోవిధాల నచ్చచెప్పడానికి చూసింది. అయినా వాళ్ళ అబ్బాయి సతీష్ వినలేదు. ఈ సారి ఎలాగైనా వచ్చి తీరాలి అని పట్టుబట్టాడు.

" అమెరికా చాలా బావుంటుందమ్మా, నువ్వొకసారి ఇక్కడకొచ్చి అన్నీ చూస్తే నాకు సంతోషం, మా స్నేహితుల అమ్మా, నాన్నలందరూ రావట్లేదా? " అంటూ ప్రయాణానికి కావలసిన కాగితాలూ అవీ పంపాడు. దాని పర్యవసానమే ఈ వీసా కార్యాలయానికి రాక.

"పోనీ ఎల్లి రా, భాగ్యమ్మా!, ఈరోజుల్లో రమ్మనేటోళ్ళెవరూ? వస్తామన్నా వద్దనే పిల్లలేకానీ, మన సతీష్ మంచోడు, ఈ మాత్రం సత్తువున్నప్పుడే పోయి సూసేసి రా. ఆడికీ బాగుంటది, మీ అల్లుళ్ళనిబ్బంది పెట్టొద్దులే, వీసా పనికి మా చిన్నోడిని పంపుతా, నీ యెనకమాలే ఉండి తీసుకొస్తాడు" అన్నారు ఊరిలో పెద్దమనిషి చౌదరి గారు.

పదిహేనేళ్ళ క్రితం భర్త కాలం చేస్తే, పిల్లలు ముగ్గురినీ తనే తల్లీ, తండ్రీ అయి పెంచిందావిడ. ఆడపిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళు అయి ఒకరు మెడ్రాస్ లోనూ, మరొకరు అహ్మదాబాద్ లోనూ ఉంటారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన కొడుకు సతీష్, ఉద్యోగంలో చేరి ఆ సంస్థ వారే అమెరికా పంపడంవల్ల గత నాలుగేళ్ళుగా అక్కడే ఉంటున్నాడు. ఏడాదికొకసారి వస్తాడు, ఈ సంవత్సరం అక్కడ ఇల్లు కొనాలని అతని ఆలోచన, అతనికి పెళ్ళి చెయ్యాలని ఈవిడ ఆలోచన.

"అక్కడేం అడుగుతారో? అసలింగ్లీషే రాని నా బోటి వాళ్ళు ఎలాగయ్యా అక్కడాళ్ళతో వేగేది? "అని కొడుకుతో పదే పదే అంది.

" అక్కడ తెలుగులో అనువాదం చేసేవాళ్ళుంటారమ్మా, నువ్వేమీ భయపడకు" అన్నాడు. అయినా ఆవిడకి దడగానే ఉంది.

గేట్ దగ్గర పేపర్లూ అవీ చూశాకా లోపలకి పంపాడు. హాలులో కూర్చుని మెల్లిగా చుట్టూ చూసింది ఆవిడ, ఎవరైనా తెలిసిన వాళ్ళు కనిపిస్తారేమో అని చిన్న ఆశ. ' ఎక్కడకెళ్ళినా తెలిసినవారు కనిపిస్తారేమో అని చూడడం, కనిపించకపోతే నిరాశ పడటమూ మానవ సహజం.' ఆవిడ ఊహించినట్టుగా ఎవరూ కనపడలేదు. నీట్ గా, పేంట్ చొక్కాలు వేసుకుని మెరిసిపోతున్న యువకులూ, అయితే చేతిలో చిన్న పిల్లలనీ, లేకపోతే పెళ్ళి కార్డులూ, ఫోటోలనీపట్టుకుని అమెరికాలో ఉన్న తమ భర్తల దగ్గరకి ఎప్పుడెప్పుడు

వెళ్ళిపోదామా అని కలలు కంటున్న అమ్మాయిలూ, తనలాగే పిల్లలదగ్గరకి వెళ్ళడానికే కాబోలు అన్నట్లున్న కొందరు పెద్దవాళ్ళూ, ఎక్కడ చూసినా జనం. ఎవరి లోకంలో వాళ్ళున్నారు, పక్కవారిని చూసి మాట కాదు కదా, కనీసం నవ్వేంత తీరిక లేనట్లు, అందరూ ఎవరి హడావిడిలో వారు.

కొడుకు చెప్పిన మాటలని మనసులోనే మళ్ళీ మళ్ళీ చెప్పుకోసాగింది. "తెలుగు ప్లీజ్, డోంట్ నో ఇంగ్లీష్". అవి ఇప్పటికి నలభైతొమ్మిది సార్లు చెప్పుకుంది, "మళ్ళీ మర్చిపోతే?" అని గాభరా. ఊరిలో ఇరవైమంది జీతగాళ్ళని ఒంటిచేత్తో శాసించే భాగ్యమ్మ ఆవిడ.

ఆవిడ వంతు రాగానే కిటికీ దగ్గరగా వెళ్ళింది. "పాపం జైలులో కూర్చున్నట్టు ఎలా కూర్చున్నారో" అనుకుంది కిటికీ అద్దానికి అవతల పక్కనున్న ఆఫీసర్ ని చూసి.

"యెస్ మాం" అని ఆయన అనగానే ఆవిడ కంగారు రెట్టింపైంది.

"ఇంగ్లీష్ నో, తెలుగు" అని మాత్రం అనగలిగింది.

అప్పటికే అక్కడ ఒక అనువాదకుడు రావడం చూసి కొంత బెంగ తీరినట్టుగా నిట్టూర్చింది.

అప్పుడు ఆఫీసర్ ఇంగ్లీష్ లో ప్రశ్నలు అడగడమూ, దానికి అనువాదం చేసే ఆయన దాన్ని తెలుగు లోకి తర్జుమా చెయ్యడమూ మొదలయింది.

"అమ్మా, మీరు ఎందుకు అమెరికా వెళ్దామని అనుకుంటున్నారు?"

"మా అబ్బాయున్నాడండీ అక్కడ, అమెరికా చాలా బాగుంటుంది, చూడటానికి రా అమ్మా అని గోలెడుతుంటే సరే అని బయలుదేరానండి" అంది.

ఆయన "అంత వివరం అక్కర్లేదమ్మా "అని ఆఫీసర్ కి ఇంగ్లీష్ లో మార్చి చెప్పాడు.

"అమ్మా, ఇప్పుడు ఆఫీసర్ గారు కాగితాలు చూపించమని అడుగుతారు, మీరు వారు అడిగినవి చూపించండి అన్నాడు.

" ముందర మీ అబ్బాయి అమెరికానించి మీకు పంపిన కాగితం చూపించండి"

" ఒక్క కాగితమనేకాదండి, మొత్తం ఫైలంతా అమెరికానించొచ్చినదేనండి" అంది అమాయకంగా. దానికి అతను నవ్వాడు, ఆఫీసర్ కూడా కొంచం ప్రసన్నంగానే అయ్యాడు. వెనక ఉన్న వాళ్ళు కూడా నవ్వినట్టు అనుమానం వచ్చి కొంత చిన్నతనంగా అనిపించిందావిడకి.

ఆ తర్వాత "ఎన్నాళ్ళుంటావు? మళ్ళీ ఎప్పుడొస్తావు? ఇక్కడ ఆస్థులు అవీ ఏమున్నాయి?" వగైరా ప్రశ్నలు వేసి,

" అమ్మా ఆఫీసర్ గారు మీకు వీసా మంజూరు చేశారు " అని తర్వాత ఏం చెయ్యాలో వివరాలు చెప్పి పంపించాడు. "బ్రతుకు జీవుడా" అనుకుని ఆవిడ బయటపడింది.

బయట తనకోసమే చూస్తున్న చౌదరిగారి అబ్బాయితో చెప్పి, కొడుకుకి ఫోన్ చేయించింది. "అమ్మయ్యా, మొదటి అంకం పూర్తయిందమ్మా, ఇంక తర్వాత పర్వాలేదులే, నా స్నేహితొడకడు వస్తున్నాడు, వాడితో కొంటాను నీకు టికట్, దగ్గరుండి తీసుకొస్తాడు అన్నాడు.

"అలా చెయ్యరా అయ్యలూ, లేకపోతే నా గుండెకాయ అక్కడకొచ్చేలోపలే ఆగిపోయిద్దేమోనని భయమేస్తొందిరా బాబూ" అంది.

అలా ఆవిడ వీసా సంపాదించుకుని మళ్ళీ సొంత ఊరుకు వచ్చినప్పటినించీ ఊరిలో అందరూ రావడమూ, అడగడమూ, అదొక వింతలా అయింది. ఆవిడ వయసు వారికైతే మరీ చిత్రంగా ఉంది ఆవిడ వీసాకి వెళ్ళి వచ్చిందంటేనే. అప్పటినించీ ఇంచుమించు రోజూ వాళ్ళ అబ్బాయి ఫోన్ చెయ్యడం, అన్ని వివరాలూ రోజూ మళ్ళీ వల్లె వేయడమూ. అప్పటికావిడకి కొంత ఉత్సాహం మొదలయింది, కొద్ది కొద్దిగా వివరాలు తెలుసుకోవడానికి ఉత్సాహం చూపించడం మొదలుపెట్టింది.

మూడు రోజుల తర్వాత సతీష్ స్నేహితుడు రాము ఫోన్ చేశాడు. "నమస్కారమండీ, నాపేరు రాఘవ, స్నేహితులందరూ రాము అంటారు, మీరేమీ కంగారు పడకండి, నేనూ, సతీష్ దగ్గరలొనే ఉంటాము, మిమ్మల్ని జాగ్రత్తగా వాడి దగ్గరకి తీసుకెళ్ళే బాధ్యత నాది" అని చెప్పిన తర్వాత ఆవిడకి కొండంత ధైర్యం వచ్చింది.

"అమ్మా నువ్వూరికే హైరానా పడి ఊరికే పచ్చళ్ళూ, స్వీట్లూ అవీ మోసుకుని రాకు, అక్కడకొచ్చినప్పుడు తింటూనే ఉన్నాను కదా," అన్నా సరే, పని అమ్మాయినీ, పక్కింటివాళ్ళనీ చేర్చి కజ్జికాయలూ, చెక్కలూ, కారప్పూసా, సున్నుండలూ, అరిసెలూ వగైరాలు, రకరకాల పచ్చళ్ళూ చేయించింది.

ప్రయాణం దగ్గరపడుతూడగా అమ్మాయిలిద్దరూ వచ్చారు, అల్లుళ్ళు ప్రయాణపు తేదీకి రెండు రోజుల ముందు వస్తామన్నారు. కూతుళ్ళిద్దరూ ఆవిడ సామాన్లన్నీ తమ్ముడు చెప్పిన ప్రకారం సర్దారు, ఆవిడ తర్వాత ఇబ్బంది పడకుండా. అందరూ ఆవిడ ప్రయాణం కోసం ఆత్రంగా ఎదురుచూడసాగారు. సతీష్ రోజూ ఫోన్ చేసి సంగతులూ, జాగ్రత్తలూ చెప్తూనే ఉన్నాడు.

అలా ఒకరోజు సతీష్ ఫోన్ చేసి గిరిజక్క తో మాట్లాడాలి అని ఆవిడ పెద్ద కూతురితో చెప్పాడు. " అక్కా, చిన్న బాడ్ న్యూస్, రాముగాడికి నిన్న శ్రీశైలం హైవే మీద ఆక్సిడెంట్ అయిందిట, బాగా దెబ్బలు తగిలి, ఎముకలు విరిగాయిట, వాడినోసారి మీరు చూసి రావాలి, కట్లు కట్టారుట, నేను మాట్లాడానులే, కానీ ఇలాంటి పరిస్థితిలో వాడు సమయానికి ప్రయాణం అవలేదు, అమ్మని ఎలా? అని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

గిరిజ కూడా ఆలోచనలో పడింది. విషయం తెలిసి ఆవిడ వెంటనే అంది" నే చెప్పలేదూ? నాకూ దూరప్రయాణానికి కుదరదర్రా, అంటే మీరు ఒక్కరైనా వింటేనా? మీ గోలే మీది గాని" అని ఇంకా ఏదో అనబోతుంటే వారించి, గిరిజా, చిన్నకూతురు కుసుమా నచ్చచెప్పారు, మంచి ఇళ్ళు రెండు మూడు చూశాడు కదా, మళ్ళీ మూఢాలు రాకుండా కుదుర్చుకుంటే వీలున్నంత తొందరలో పెళ్ళి కూడా చేసేయవచ్చు అని, అన్నారే కానీ ఒక్కర్తే ఎలా వెళ్తుంది ?అంత దూరం అని మరో ఆలోచన.

మొత్తానికి అనేక తర్జన భర్జనల తర్వాత ఆవిడ కూడా బయలుదేరడానికే నిశ్చయించుకుంది. హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ ని చూసేసరికే ఆవిడకి కళ్ళు తిరిగినంత పనైంది. పెద్ద అల్లుడు ఎవరో తెలిసిన వారుండడంతో లోపలకి పాస్ తీసుకుని సామాన్లు' చెక్ ఇన్ ' చేసి, బోర్డింగ్ కార్డులు ఇచ్చే దాకా రాగలిగాడు.

"ఇంక ఇక్కడనుంచి మీరొక్కరే వెళ్ళాలి అత్తమ్మా, జాగ్రత్త గా వెళ్ళి రండి, మరేమీ పరవాలేదు. పొలం పనులు అవీ చౌదరిగారూ, ఇంటి విషయాలు పూజారిగారి భార్య సావిత్రమ్మ గారూ చూసుకుంటారు. మధ్యలో మేము వచ్చి చూసెళతాం, అందుకనీ మరేమీ ఆలోచించకుండా సరదాగా నాలుగు ఊళ్ళు చూసి రండి" అని అనునయంగా చెప్పాడు.

"అలాగేలెండి అల్లుడు గారూ, మీరు, అమ్మాయీ, పిల్లలూ జాగ్రత్త" అంటూనే తన చేతి నున్న బాగ్ ని అల్లుడు తెచ్చినట్రాలీ మీద ఉంచి భారంగా లోపలకి అడుగువేసింది. ఇమ్మిగ్రేషన్ ఫారం అదీ నింపడానికి పక్కనెవరినో సహాయం అడిగింది, కొడుకు అన్ని వివరాలూ చెప్పినా సరే. మొత్తానికి సెక్యూరిటీ చెక్ దగ్గరకొచ్చేసరికే ఆవిడకి నీరసం వచ్చింది.

"ఇవేం ప్రయాణాలురా నాయనా, ఎలా చేస్తారో? ఎందుకో అసలు"? అనుకుంటూ నెమ్మదిగా వరసగా ఉన్న ఇనపకుర్చీలలో ఒకదానిలో కూర్చుంది. ట్రాలీ బయటే వదిలేయవలసి రావడంతో బాగ్ దగ్గరగా పెట్టుకుని కూర్చుంది. చాలా మంది తెలుగువారే కనిపించడంతో కాస్త ధైర్యం వచ్చింది ఆవిడకి. పక్కనే ఉన్న వారితో పరిచయం చేసుకునే ప్రయత్నం చెయ్యబోయింది. ఆ అమ్మాయి పలకరింపుగా ఒక నవ్వు నవ్వేసి, తను తెచ్చుకున్న పుస్తకంలో పడిపోయింది.

అంతలో ఆవిడకి తనకి ఊహ తెలిసీ తెలియని వయసులో తల్లితండ్రులతో తిరుపతి వెళ్ళిన వైనం గుర్తొచ్చింది. అప్పుడు తనకి ఏడేళ్ళుంటాయేమో, తమ్ముడి పుట్టువెంట్రుకలకని తిరుపతి వెళ్ళారు వాళ్ళందరూ. బస్ లో కిటికీ దగ్గర కూర్చుని వెనక్కి పరిగెడుతున్న చెట్లని లెక్కపెడుతూ ఆనందిస్తోంది తను, గాలి హాయిగా వీస్తోంది. అంతలో పెద్ద శబ్దంతో వెనక టైర్లు రెండూ పేలిపోయాయి, రాత్రి ఏడయిందేమో, ఇప్పటిలా గడీకో బస్సూ, రైలూ లేని కాలంలో, కండక్టర్ పాపం లారీ పట్టుకుని దగ్గరలో ఉన్న డిపో కెళ్ళి కొత్త బస్ మాట్లాడుకుని వచ్చి అందరినీ ఎక్కించేసరికి రాత్రి పన్నెండయింది. అందరికీ నీరసం, ఆకలి, భయం. ఇప్పటికీ మర్చిపోదా ప్రయాణం. అదే తన మొదటి దూర ప్రయాణం, అప్పట్లో అదే గొప్ప." ఛీ మంచి విషయాలు తల్చుకోవాలి "అని ఆలోచనల్లోంచి బయటకి వచ్చింది

ఇంకేం చెయ్యాలో తెలియక, కాసేపు అటూ ఇటూ తిరుగుదామని లేచింది. అటువైపుగా ఉన్న ఒక పెద్దవయసు జంట వైపు చూసి పలకరింపుగా నవ్వింది. వారు కూడా మొదటిసారే వెళుతున్నట్టుగా ఉన్నారు, వెంటనే పలకరించారు. భాగ్యలక్ష్మి కి ప్రాణం లేచి వచ్చినట్టయింది.

" మీరూ అమెరికాకేనా? అడిగింది. "

"అవునండీ, ఎమిరేట్స్, దుబాయి మీదుగా, మీరు అదేనా? అన్నాడాయన".

" కాదండీ, మా అబ్బాయి మలేసియా అన్నాడు, మీరు చూడండి ఇదిగో టిక్కట్లు" అని బోర్డింగ్ పాస్ లు చూపించింది.

" అవును, మీరు మలేసియా మీదుగా వస్తారు, మేము దుబాయి మీదుగా. మీ విమానం మా దానికంటే దాదాపు గంట ముందు బయలుదేరుతుంది" అని వివరించాడాయన.

నీరసపడినట్టుగా "అయ్యో, అలాగా? అందరం వెళ్ళేది ఒకే అమెరికా అయినప్పుడు ఒకే విమానంలో పంపేస్తే పోలా? ఇంత చేటు దానికి అన్ని విమానాలెందుకూ?" అంది.

" అబ్బే, అలా కాదండీ, అమెరికా చాలా పెద్దది, మనం వెళ్ళవలసిన ప్రాంతాన్ని బట్టి టిక్కెట్లు కొనుక్కోవాలి, సాధారణంగా పిల్లలు అలాగే కొంటారు, మీకింకో మాట చెప్పనా? మనందరం చివరికి వెళ్ళేచోటు కూడా ఒకటే కదండీ, అయినా అందరమూ తలోదారిలోనూ, తలో టైములోనూ వెళ్ళడంలేదూ? ఇదీ అంతే "అన్నాడు నవ్వుతూ.

" అయ్యో, శుభమాని పిల్లలదగ్గరకెళ్తున్నప్పుడలాంటి మాటలెందుకులే అయ్యా?" అంది కంగారుగా. దానికాయన మరింత నవ్వుతూ " నిజమంతే కదండీ, అదిగో మీ విమానంలో మనుషుల్ని ఎక్కనిస్తున్నారు, మీరు బయలుదేరండి" అని చెప్పాడు.

ఆ మాటకి "భలేవోడే" అనుకుంటూ కంగారుగా తన బాగ్ పుచ్చుకుని బోర్డింగ్ వైపుకి నడిచిందావిడ.

" విమానం మలేసియా వెళుతుంది, అక్కడ మూడు గంటలు వెయిటింగ్ టైము, అక్కడ ఎవరిని అడిగినా నువ్వు ఎక్కడ రెండో విమానం ఎలా ఎక్కాలో చెప్తారు, అందుకని స్థిమితంగా, ధైర్యంగా ఉండి, నెమ్మదిగా ఎవరినైన అడుగు. తెలుగువారు కనపడితే మరీ మంచిది, లేకపోయినా మలేసియా విమానాల్లో తమిళం వచ్చిన సిబ్బంది ఉంటారు, వాళ్ళని అడిగినా నిన్ను జాగ్రత్తగా విమానంవరకూ తీసుకెళతారు " అని కొడుకూ, కూతుళ్ళూ చెప్పారు.

ఆవిడ అవే మాటలు గుర్తు చేసుకుంటూ ఏరో బ్రిడ్జ్ లోంచి విమానం లోకి అడుగుపెట్టింది. తెల్లగా మిస మిసా మెరుస్తున్న అమ్మయిలూ, అబ్బయిలూ "వెల్కం మాం" అంటే కొంత ఆనందం, కొంత సిగ్గూ ముంచుకుని వచ్చాయి ఆవిడకి. నవ్వింది బదులుగా. వారు చూపించిన సీట్ నంబర్ వెతుక్కుని కూర్చుంది. నెమ్మదిగా ఒక్కొక్కరూ రావడాన్నీ, తమ నెంబర్లు చూసుకుని సీట్లలో కూర్చోవడాన్నీ, పైన సామాన్లు పెట్టుకునే అరలనీ, వాటికి అటూ ఇటూ ఉన్న ఏర్ కండిషనర్నీ అన్నింటినీ చాలా ఆశ్చర్యంతో గమనించసాగింది. అప్పుడే చలి వెయ్యడంతో బాగ్ లోంచి తీసుకున్న శాలువా కప్పుకుని కూర్చుంది. ఇంతలో గడ గడా ఇంగ్లీష్ లోఏదో చెప్పారు. సీట్ బెల్ట్ పెట్టుకోవడం అవీ వాళ్ళు చూపించినట్టే చేసింది.

కిటికీ పక్కన ఇందాకటి పుస్తకం అమ్మాయి, మధ్యలో సీట్ ఖాళీ గా ఉంది, తనది చివరి సీటు. ఇంతలో ఒక్కసారి పెద్ద లైట్లన్నీ ఆగిపోయాయి, బొయ్యన్న పెద్ద శబ్దంతో విమానం మొదలయింది, ముందు మెల్లగా నడక మొదలుపెట్టిన విమానం ఇప్పుడు గబ గబా పరిగెడుతున్నట్టు అర్థం అయిందావిడకి. విమానం అలా పరిగెడుతూ అటూ ఇటూ కొద్దిగా ఊగుతున్నట్టుగా అవుతూంటే ఆవిడకి భయం వేసింది, అప్పుడెప్పుడో పట్టాలు తప్పిన రైలులా అవదు కదా ఇది కూడా? అనుకుని కొంచం భయంగా కళ్ళు మూసుకుంది.

కూతురిని మొదటిసారి అల్లుడు దగ్గర దింపి రావడానికి అహమదాబాద్ బయలుదేరారు తనూ, భర్తా. అదేం రైలో!, ఎక్కినప్పటినించీ ఒకటే రొదా, ఊగడమూనూ. ఎలా భయపడిందో అలాగే బయలుదేరిన మూడుగంటలకి పట్టాలు తప్పేసి పడిపోయింది. అదృష్టవశాత్తూ ఎవరూ పోలేదు, కానీ చాలా మందికి బాగా దెబ్బలు తగిలాయి, తమ పెట్టె బాగా వెనక్కున్నందువల్ల తమకేమీ కాలేదు కానీ, ఆ రాత్రి అక్కడే ఏటూ కాని చోట ఉండిపోవలసి వచ్చింది. ఆంబులెన్స్లలో దెబ్బలు తగిలిన వారిని దగ్గరలోని ఆసుపత్రులకి తీసుకెళ్ళడమూ, పట్టాలు సరిచేసి, పాడయిన పెట్టెలని తొలగించి, అన్నీ సరి చేసేసరికి చాలా సమయం పట్టింది. దాదాపు పదహారు గంటలు అలా చీకట్లో ఆ చిన్న ఊరి ప్లాట్ ఫార్మ్ మీద గడపడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం ఆమెకి,

ఎంత వద్దనుకున్నా అదే గుర్తుకు వస్తోంది. ఆ తర్వాత మరొక రెండు నిమిషాలకే విమానం గాల్లో ఎగరడం మొదలుపెట్టినట్టు అర్థం అయి సన్నగా ఊపిరి పీల్చుకుంది "స్మూథ్ టేక్ ఆఫ్" అని పక్కవాళ్ళు అనుకోవడం వింది.

"దుర్గమ్మ తల్లీ, అంతా నీ దయే" పైకే అనుకుంది. ఆ మాట విని పక్కనున్న అమ్మయి కిసుక్కున నవ్వింది.

"పాపా, అయితే నీకు తెలుగొచ్చున్నమాట" అంది భాగ్యమ్మ చనువుగా.

"చాలా కొంచం, నెను అమెరికాలోనే ఉన్నాను, అందుకే కొంచమే వస్తు తెలుగు" అందామ్మాయి మాటలు కూడబలుక్కుంటూ.

"ఒహో, మరి ఇక్కడికెందుకు వచ్చావు? సెలవులకా?" ఆమాత్రం మాటాడేవారు దొరకడంతో లేని ఉత్సాహం వచ్చింది ఆవిడకి.

" యా, గ్రాండ్ మాస్ హౌస్" అంది. ఆవిడ ముఖం చూసి "అమామా." అంది.

"ఒహో అమ్మమ్మగారి ఇల్లా? బావుంది, హైదరాబాదా? అంది ఆవిడ

"యా "అందామ్మాయి.

ఇంతలో ఎయిర్ హోస్టెస్ చేతిలో ట్రే తో వచ్చి "మిసెస్, భాగ్యలెక్ష్మీ ..యువర్ వెజిటేరియన్ మీల్" అని ఆవిడ సీటుకి ఎదురుగా ఉన్న సీటు వెనకవైపున్న ట్రే నికిందకి దింపి దానిమీద పెట్టింది.

"అర్ధరాత్రి దాటింది, ఇప్పుడేం భోజనం?" అందావిడ పక్క అమ్మాయిని చూస్తూ.

" యూ మయ్ నాట్ గెట్ వెన్ యూ వాంట్, ప్లీజ్ ఈట్ నౌ" అంది.

ఆ అమ్మాయి అభినయాన్ని బట్టి భావాన్ని అర్ధం చేసుకుంది కానీ అలవాటు లేని ఆ వేళ తినలేకపోయింది. " వద్దులే అమ్మా, నువ్వంటే చిన్నపిల్లవి, ఏ వేళప్పుడు తిన్నా పరవాలేదు, మాకలా కాదు, జ్యూస్ తాగుతాలే" అని జ్యూస్ మాత్రం తాగింది.

ఆ అమ్మాయి తినేసి, కళ్ళ మీదకి లైట్ పడకుండా గంతలు పెట్టేసుకుని, విమానం వాళ్ళిచ్చిన దుప్పటి కప్పేసుకుని పడుకుంది.

భాగ్యమ్మ కి నిద్ర రాలేదు. దుర్గమ్మ ని తలుచుకుంటూ కూర్చుంది. ఆ పక్కమ్మాయే ఎదురుగా ఉన్న వీడీయోలు అవీ ఎలా పెట్టుకోవాలో చూపించింది కానీ, ఆవిడకి సగం అర్ధం కాకా, కావలసినవి లేకా ఏమీ పెట్టుకోలేదు. ఎప్పుడో బయలుదేరిందేమో, అప్పుడే కాళ్ళూ , నడుమూ పీకేస్తున్నాయి. హాయిగా తన పెద్ద పందిరి మంచం మీద పడుకునే వేళ. ఈ ఇరుకు కుర్చీలో నిదరెలా వస్తుంది? అనుకుంది విసుగ్గా.

కౌలాలంపూర్ విమానాశ్రయంలో పెద్ద శబ్దంతో దిగింది విమానం. ముందే చెప్పారు విమానంలో తమిళం వచ్చిన ఒక హోస్టెస్ ఉందనీ, కావలసిన వారు ఆమె సహాయం తీసుకోవచ్చు అని. ఆ అమ్మాయి పేరు ప్రియ, తనలాగా పెద్దవాళ్ళుంటే వారిదగ్గరకి వెళ్ళి ఏమైనా కావాలా అని అడుగుతోంది.

" ఓ ఉంగలు తెలుంగా? కొంచమావచ్చు ఎనక్కు" అని విమానం దిగాకా ఎటువైపు వెళ్ళాలి, ఎలా తన తర్వాత విమానం ఎక్కాలి అన్న విషయాలు వివరించింది.

" నువ్వు నాతో ఆ విమానంలో రావా అమ్మా?" అని అడిగింది భాగ్యమ్మ ఆ అమ్మయి చేతిని వదలకుండా పట్టుకుంటూ.

" ఇల్ల, ఎన్నకు ఇంకో ఫ్లైట్ లో దా డ్యూటీ" అంది నవ్వుతూ.

పక్కనున్న అమ్మాయి కూడా ఇక్కడ దిగేసి మరింకేదో విమానం ఎక్కుతుందిట, కనీసం ఆ పిల్లైనా తోడుంటుందేమో అనుకుంటే సానోసే నో ఏదోపేరు చెప్పేసి, చిటికెలో 'బాయ్' అని చెయ్యి ఊపేసి వెళ్ళిపోయింది.

జాగ్రత్తగా ప్రియ చెప్పినట్టు బోర్డింగ్ కార్డ్ మీద ఉన్న నెంబర్లు చూసుకుంటూ తనెక్కవలసిన గేట్ దగ్గరకి వచ్చింది. రకరకాల మనుషులతో విమానాశ్రయం అంతా కోలాహలంగా ఉంది.

" ఈ ప్రయాణం నాలుగైదు గంటలు కాదు, పదిహేను గంటలదాకా ఉంటుంది, అందుకని వాళ్ళు పెట్టినవాటిలో నీకు ఏది తినాలనిపిస్తే అది తిను, లేకపోతే నీరసం వస్తుంది" అని చెప్పాడు సతీష్. ఇప్పటికే నీరసంగా ఉంది ఆవిడకి.

నెమ్మదిగా రెండో విమానం ఎక్కింది, ఈ సారి తెలుగువాళ్ళు కాదు కదా, ఇండియన్స్ కూడా ఎవరూ కనిపించలేదు ఆవిడకి తన చుట్టుపక్కల, ఈ సారి కూడా ఆవిడకి చివరి సీటు, మధ్యలో ఒక తెల్లటి అబ్బాయి, పొడుగ్గా, బలంగా నవ్వుముఖం తో ఉన్నాడు. అతని పక్కన కిటికీ దగ్గర ఒక బట్టతలాయన, ఎక్కగానే నిద్రపోవడం మొదలుపెట్టాడు. చెవుల్లో దూది పెట్టుకుని, దుర్గమ్మని స్మరించుకుంటూ కూర్చుంది.

కొద్దిగా భయంతో తన కుర్చీ హాండిల్ గట్టిగా పట్టుకున్న ఆవిడని చూసి పక్కనున్న అబ్బాయి చిన్నగా నవ్వుతూ "ఫస్ట్ టైం?" అని అడిగాడు, ఫస్ట్ అన్నమాట అర్ధమై గబ గబా తల ఊపింది.

" నాట్ టూ వర్రీ" అన్నాడు అతను.

"వర్రీ అంటాడు, నవ్వుతూ అంటాడు" అని ఆవిడకి అనుమానం.

ఈ సారి భోజనం లో ఏదో కొద్దిగా తిన్నాననిపించి మళ్ళీ ఆరెంజ్ జ్యూస్ తాగింది. ఆ అబ్బాయి కానీ, అతను కాని లేచి వెళ్ళాలంటే తను తప్పక లేచి దారి ఇవ్వాల్సిందే, అలా కదిలే విమానంలో నిలబడడం ఆమెకి వింతగా, కొత్తగా ఉంది, టాయ్ లెట్ ఎలా ఉపయోగించాలో ఇందాకా ప్రియ చెప్పింది, కొడుకు కూడా పది సార్లు చెప్పాడు కనక పెద్ద ఇబ్బంది పడలేదు ఆవిడ.

టైం ఎంతయిందో కూడా తెలియడం లేదు ఆవిడకి, ఆవిడ వాచీ ఇండియా టైమే చూపిస్తోంది. మెల్లగా అలసటతో నిద్ర వచ్చింది. కనురెప్పలు మూత పడేంతలో ఏదో పెద్ద శబ్దం, అందరూ ఉలిక్కి పడ్డారు, పసిపిల్లలు ఒకళ్ళిద్దరు గుక్క పట్టి ఏడ్వటం మొదలు పెట్టారు. అధాట్టున కళ్ళు తెరిచిందావిడ. చుట్టూ ఉన్న వాతావరణంలోని కంగారుని గుర్తించింది. దానికి తోడు వరసగా స్పీకర్ లోంచి ఏదో చెప్తున్నారు, ఇవన్నీ చూస్తే ఆవిడకి చాలా భయం వేసింది.

"ఏమయిందయ్యా? "అనుకోకుండా తెలుగులోనే పక్క సీటులోని అబ్బాయిని అడిగేసింది.

అతను అర్ధం చేసుకున్నట్టు "ఐ డోంట్ నో, లుక్స్ లైక్ సం ప్రాబ్లెం " అన్నాడు భుజాలెగరేస్తూ.

"ప్రాబ్లెమా? ఎమయింది?" కంగారుగా అంది మళ్ళీ .

" డోంట్ వర్రీ, వీ విల్ నో నౌ" అన్నాడు. విమానంలో ఏదో సాంకేతిక లోపం వచ్చినందున మళ్ళీ వెనక్కి కౌలాలంపూర్ తీసుకుని వెళుతున్నామనీ, వీలున్నంత త్వరలో అందరినీ తమ తమ గమ్యస్థానాలకి చేరుస్తామనీ, ఎవరూ కంగారు పడవలసిన అవసరం లేదనీ, పదే పదే చెప్పారు. ఆవిడకి పూర్తిగా అర్ధం కాకపోయినా కొంతవరకూ గ్రహించగలిగింది,

" ఇదేం ఖర్మరా భగవంతుడా? లేక లేక నేను బయలుదేరితే ఆ విమానమే ఇలా అవ్వాలా? ఏం ఖర్మమో, ఎక్కిన టైము బాగోలేదేమో?" ఇలా అనేక రకాలుగా అనుకుంటూ ఏం చెయ్యాలో తెలియక అలాగే కూర్చుండిపోయింది గట్టిగా తన సీటు రెండు హాండిల్స్ పట్టుకుని, కళ్ళు మూసుకుని. అనుకోకుండానే ఆవిడ కళ్ళల్లోకి నీళ్ళు వచ్చి చేరుతున్నాయి.

ఎంతసేపుందో తెలీదు అలా, తనచేతిమీద ఎవరిదో చెయ్యి పడినట్టనిపిస్తే అప్పుడు కళ్ళు తెరిచి చూసింది, పక్కనున్న అబ్బాయి అదే నవ్వుముఖంతో "గెట్ డౌన్?" అంటున్నాడు, అప్పుడు గ్రహించిందావిడ తను ఇంతసేపూ ఆ అబ్బాయి చెయ్యి పట్టుకుని కూర్చుందని. " నో వర్రీ, గెట్ డౌన్" అన్నాడు. అతను చేసిన సైగలని బట్టి తాము మళ్ళీ కౌలాలంపూర్ విమానాశ్రయానికి వచ్చేసినట్టు గ్రహించింది. "ఆర్ యూ ఓకే?" అన్నాడు అతను. తల ఊపింది ఆవిడ. మెల్లగా తన బాగ్ తీసుకుని దిగింది.

ఇంక అక్కడనించీ మొదలయింది ప్రహసనం, ప్రయాణీకులని ఇతరవిమానాల్లో సర్ది పంపడానికీ, తర్వాత విమానానికి ఆరుగంటలకంటే ఎక్కువ వ్యవధి ఉంటే వారిని అక్కడే ఎయిర్ పోర్ట్ లో ఉన్న హోటళ్ళలో ఉంచి తర్వాత పంపిచడానికీ, ఇలా రకరకాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎయిర్ లైన్ వారు తమ వంతు పని చేస్తున్నారు, రెండు వందలకు పైగా ఉన్న ప్రయాణీకులని ఏ ఇబ్బందీ లేకుండా చూడాలి, అందరినీ వారి వారి గమ్యస్థానాలకి సురక్షితంగా పంపాలి, అదేమంత సులభం కాదు, ప్రయాణీకుల ఆదుర్దా కూడా అర్థం చేసుకోతగిందే, ఎవరి పక్కనుంచి చూస్తే వారు చెప్పేదీ, చేసేదీ రైటే.

భాగ్యలక్ష్మి కి మరో ఏడు గంటల్లో బయలుదేరే విమానంలో ఉన్న ఖాళీ సీట్ ఇచ్చామని అంటూ, అప్పటివరకూ ఆవిడ ఉండాల్సిన హోటల్ వివరాలన్నీ చెప్పిందా కౌంటర్ లో ఉన్న అమ్మాయి. అర్థం అయ్యీ కాకుండా ఉందావిడకి.

ఆ అమ్మాయి మళ్ళీ చాలా ఓపికగా వివరించింది. ఇందాకా ప్రియ తీసుకుని వచ్చిందావిడని టెర్మినల్ కీ, టెర్మినల్ కీ మధ్యన నడిచే రైలు లో. ఇపుడు మళ్ళీ అదే రైల్ లో మెయిన్ టెర్మినల్ కి వెళ్ళి, అక్కడ కొంచం ముందుకు నడిస్తే ఉందిట హొటేల్, అక్కడ కాసేపు రెస్ట్ తీసుకోవచ్చుని, మళ్ళీ సాయంత్రం వస్తే కొత్త విమానం ఎక్కిస్తామని చెప్పింది. ఏం చెయ్యాలో తోచనట్టు అక్కడే నిలబడిందావిడ, హొటేల్ వోచర్ చేతిలో పట్టుకుని.

ఇంతలో వచ్చాడు ఆ అబ్బాయి," సేం హొటేల్? "అన్నాడు. మౌనంగా తల ఊపి అతనికి చూపెట్టింది.

"సేం ఫ్లైట్ టూ? ఎల్.ఏ?"అడిగాడు, ఈ పాటికి అతనికి అర్థం అయింది,

ఆవిడకి అర్థం అయ్యేలా చిన్న ముక్కల్లో ఎలా మాట్లాడాలో.

"ఎల్.ఏ? అంటే ఏందయ్యా?" అందావిడ అతన్ని చూడగానే కొంత ధైర్యంగా.

"లాస్ ఏంజెలీస్? అన్నాడు మళ్ళీ.

" అవును, అదే మా వాడుండేది" అని గబ గబా చెప్పింది.

" హొటేల్?" అన్నాడు అతను. వెళదామా అని అభినయిస్తూ.

" పదయ్యా, దేవుడల్లే వచ్చావు "అందావిడ ఆనందంగా.

ఇద్దరూ ట్రైన్ ఆగేదగ్గరకి వచ్చారు. మరొక్క నిమిషం లో ఆ ట్రైన్ రాగానే అతను మెరుపులా ఎక్కేశాడు, ఆవిడ ఎక్కేలోపు మరొక ముగ్గురు ఎక్కేయడమూ, వెంటనే తలుపులు మూసుకుపోవడమూ క్షణాల్లో జరిగిపోయాయి. ఇలాంటివి అలవాటు లేని ఆవిడ గబ గబా ఎక్కలేక అక్కడే ఉండిపోయింది. అతను చూశాడో లేదో ఆవిడకి తెలియలేదు. బిత్తరపోయినట్టు, చేతికందిన నిధి చేజారి పోయినట్టు ఉండి పోయింది అక్కడే. తర్వాత మెల్లిగా కాళ్ళీడ్చుకుంటూ వెనక్కి తిరిగి, దిగిన చోటకే వచ్చింది. అక్కడ ఇంకా కొందరు సిబ్బంది తో గొడవపడుతున్నారు, తమని తొందరగా పంపాలనీ, లగేజ్ సరిగ్గా వస్తుందా, రాదా? అని ఇలా రకరకాల

విషయాలకి. వారు మాట్లాడేది పూర్తిగా తెలియకపోయినా, కొద్దిగా అర్థం అవుతోంది ఆవిడకి. అక్కడున్న అన్ని కుర్చీలు నిండి పోయాయి, పిల్లలు ఏడుస్తున్నారు, తల్లులు సముదాయిస్తూన్నరు. చిత్రం, పిల్లల ఏడుపుకీ, అమ్మ ఆలనకీ భాషుండదేం? ఆ భావనలందరికీ ఒకటే, అయినా ఎవరికి వారికి ప్రత్యేకమే, అలా అనుకుంటే ఆవిడకి నవ్వొచ్చింది.

" భయపడితే ఏమొస్తుంది? పోనీ ఇక్కడే కూర్చుని, ఆ తర్వాత ఎవరినైనా అడిగి తనెక్కవలసిన విమానం ఎక్కచ్చు" అనుకుంది బింకంగా.

మొదటిసారి విమానం లో వాళ్ళు ఫోన్ ఆఫ్ చెయ్యమన్నప్పుడు ఆపేసిన ఫోన్ మళ్ళీ ఆన్ చేసుకోవడం మర్చిపోయిందావిడ. ఎప్పుడూ ఉపయోగించడం అలవాటులేకపోవడం వల్ల. దాని వల్ల ఆవిడున్న తీరానికి ఏ వైపున్న పిల్లలకీ ఫోన్ దొరకదు మరి. ఒకళ్ళిద్దరు కింద కూర్చోవడం చూసి ఆవిడ కూడా తన బాగ్ పక్కనే పెట్టుకుని ఒక మూల కూర్చుంది, కాళ్ళు విపరీతంగా లాగుతున్నాయి, అలవాటు లేని ప్రయాణాలు, ఎక్కడ ఏ టైమవుతోందో తెలియని వేళలు. ఒక అరగంట గడిచిందేమో, ఇంతలో వచ్చాడు, ఆ అబ్బాయి.

"ఓ హియర్ యూ ఆర్ ", సారీ ఐ డిడ్ నాట్ నోటీస్ " అన్నాడు.

" మా నాయనే, మళ్ళొచ్చావా? అందావిడ సంబరంగా. " కం హోటెల్" అన్నాడు.

ఒక్క క్షణం ఆలోచించింది.

"స్లీప్" అన్నాడు అతను. కాళ్ళు తిమ్మిరెక్కుతున్నాయి, నడుం వాలుస్తే బావుంటుందేమో, అని " సరే పదా, అంది. ఇద్దరూ బయలుదేరారు. ఈ సారి ట్రైన్ ఖాళీగా ఉంది. ఆవిడ ఎక్కేవరకూ ఉండి తర్వాత తను ఎక్కాడు.

"ఈ దూర ప్రయాణాలు నాకచ్చిరావయ్యా, నే చెబితే మావాడింటేనా? ఇప్పుడనేముంది? చిన్నప్పటినించీ ఇంతే నాకు, ఏదో ఆ దుర్గమ్మ దయవల్ల కష్టాలు పడినా కులాసాగానే చేరతాననుకో" అంది. ఏదో అర్థమయినట్టు నవ్వాడు.

" ఏవిటో జీవితంలోనే పడమటింటికి ప్రయాణించే వయసులో ఈ పడమటి ప్రయాణమెందుకు నాకు? అలా అంటే అరవై ఐదూ ఒక వయసేనా అమ్మా? ఇక్కడకొచ్చి చూస్తే నీకు తెలుస్తుంది నీ వయసాళ్ళు ఎంత ఉత్సాహంగా గంతులేస్తూ ఉంటారో !అంటాడు మావాడు". అంది

ఇద్దరూ హోటేల్ కి వచ్చారు. రిసెప్షనిస్ట్ రూము నంబర్లు చెప్పింది. ఆవిడకి ఆడవారి అంతస్తులోనూ, అతనికి స్మోకింగ్ జోన్ లోనూ రూములు. " లంచ్?" అనడిగాడు.

" వద్దయ్యా, నీరసంగా ఉంది " అని అంత లోనే కళ్ళు తిరిగినట్టయి కూలబడిపోయిందావిడ. రిసెప్షనిస్ట్ గబ గబా మంచినీళ్ళు తెప్పించి, లంచ్ చెయ్యమని చెప్పింది. అక్కడ వరసగా పేర్చి ఉన్న ఆహార పదార్థాలలో అన్నం, పెరుగూ చేసేసరికి ఆవిడకి ప్రాణం లేచి వచ్చింది, తర్వాత తీరిగ్గా చూస్తే కొంత తమిళ శైలిలో చేసిన సాంబార్ లాంటిదీ, కూరా కనిపించేసరికి కడుపునిండా తింది.

" నౌ స్లీప్, ఐ విల్ కం ఆఫ్టర్ టూ అవర్స్" అన్నాడు అతను నిద్రని అభినయించి, ఆ పైన తన వాచీ మీద రెండు వేళ్ళు కొట్టి.

"సరే, నువ్వు కూడా పడుకో అయ్యా, ఇందాకటినించీ నా కోసమే మళ్ళీ తిరిగావు కూడా" అందావిడ ఆప్యాయంగా.

రూం తాళం ఎలా తెరవాలో చూపించి, పక్కనే ఉన్న రేడియోలో రెండు గంటల తర్వాత మోగేటట్టుగా అలారం పెట్టింది రూం సర్వీస్ అమ్మాయి. పక్కన మరొకరున్నారన్న ధైర్యం ఇచ్చిన బలమో, నిననంటినించీ పడుతున్న అలసటో తెలీదు కానీ మంచమ్మీద వాలగానే నిద్రపోయింది, మళ్ళీ అలారం మోతకే మెలకువ వచ్చింది. నెమ్మదిగా లేచి, ఎక్కడున్నానో తెలుసుకోవడానికే రెండు నిమిషాలు పట్టింది. ముఖం కడుక్కుని, ఇంకో చీర కట్టుకుని, జుట్టు సరిగ్గా దువ్వుకుని ముడి వేసుకుంది. అప్పుడు తలుపు కొట్టింది రూం సర్వీస్ అమ్మాయి, తలుపు తెరిచి, ఆ అమ్మాయికి తాళం కార్డ్ ఇచ్చేసి, తనతో పాటే క్రిందకి వచ్చింది.

అప్పటికే ఆ అబ్బాయి అక్కడ తయారుగా ఉన్నాడు. "ఫ్రెష్?".

" నువ్వు నిద్ర పోయావా? నేను బాగా పడకేశాలే" అంటూ నవ్విందావిడ.

ఇప్పుడా అబ్బాయి పక్కనుండడం వల్ల గేట్లూ అవి వెతుక్కునే అవసరమే లేదు ఆవిడకి. ఇద్దరూ విమానం ఎక్కేశారు. అది లాస్ ఏంజలీస్ చేరుకునే సరికి దాదాపు పదహారు గంటలు పట్టింది.

విమానం దిగాకా అతని ఫోన్ ని చూసేదాకా ఆవిడకి తన సెల్ ఫోన్ సంగతి గుర్తే రాలేదు. అప్పుడు తీసి ఆన్ చేసింది, పెద్ద మనవరాలు నేర్పింది, పాతికసార్లు పరీక్ష పెట్టింది కూడా, అందుకే ఫోన్ ఎలా ఆన్ చెయ్యాలో, ఆఫ్ చెయ్యాలో నిద్రలో కూడా మర్చిపోదు, ఆఫ్ చేసి ఆన్ చెయ్యడం మర్చిపోయింది అది వేరే విషయం.

ఆన్ చేసిన వెంటనే ఫోన్ మోగింది, కొడుకు సతీష్, "అమ్మా, ఎక్కడు న్నా వు? ఇంతసేపు ఫోన్ తియ్యలేదేం ? ఏమయింది?" అంటూ వరసగా ప్రశ్నలు.

"ఉండరా అయ్యా, ఇప్పుడే, మీ ఊర్లోనే విమానం దిగాను" అంది.

" థాంక్ గాడ్, నేను బయటే ఉన్నాను, నీకోసం ఎదురుచూస్తున్నాను, సామాన్లు అవీ ఎలా తీసుకోవాలో చెప్పాను కదా, అవసరమైతే ఎవరినైనా సహాయం అడుగు" అన్నాడు.

" మా వాడే, నా విమానం ఆలస్యమయింది కదూ, కంగారు పడతన్నాడు. నువ్వు రా అయ్యా, తలుపు తగులుద్దో ఏటో, ఇంత బారుమనిషివి" అందా అబ్బాయితో నవ్వుతూ.

ఇద్దరూ ఇమ్మిగ్రేషన్ పూర్తి చేసుకుని, సామాన్లు తీసుకుని బయటకు వచ్చారు. దూరాన్నుంచే సతీష్ ని చూసి చెయ్యూపిందావిడ. అమ్మని చూసి పట్టరాని ఆనందంతో పరిగెత్తుకుని వచ్చాడు సతీష్.

" ఇదిగోనయ్యా, వీడే నా బిడ్డ, 'సన్' సతీష్,అవునూ నీ పేరే అడగలేదు ఇప్పటివరకూ అందావిడ" తమాషాగా కనుబొమలూ, భుజాలూ ఎగరేశాడు ఆ అబ్బాయి.

" ఒరే నాయనా, మలేసియా లో మేము మొదటెక్కిన విమానం చెడిపోయిందంట, దాన్ని మళ్ళీ వెనక్కి తీసుకొచ్చేసి, ఇదిగో ఇలా మమ్మలందరినీ వేరే వేరే వాటిల్లో సర్ది పంపారు, పాపం ఈ అబ్బాయి నాకెంత సహాయం చేశాడో తెలుసా, అచ్చు నీతో కలిసి వచ్చినట్టే అనిపించిందంటే నమ్ము, అతని పేరైనా అడగలేదు ఇప్పటివరకూ, నువ్వు కనుక్కుని మనింటికి రమ్మని పిలువు" అందావిడ.

సతీష్ అతనికి ధన్యవాదాలు చెప్పి, ఎటువంటి పరిస్థితుల్లో ఆవిడ ఒంటరిగా రావలసి వచ్చిందో చెప్పాడు.

"నీ పేరు చెప్పనే లేదు " అందావిడ, నవ్వుతూ. అదే ప్రశ్నని ఇంగ్లీష్ లో అడిగా డు సతీష్.

"ఐ యాం ప్రిన్స్, ప్రిన్స్ కెల్లీ, గ్లాడ్ ఐ కుడ్ బీ ఆఫ్ హెల్ప్, ప్లెజర్ మీటింగ్ యూ, అని సతీష్ తో చెప్పి, మిసస్, బాగ్యలెక్ష్మీ ఎంజాయ్ యువర్ స్టే హియర్ అని ఇద్దరికీ వీడ్కోలు చెప్తూ పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. అతను వెళ్ళినవైపే చూస్తూ కాసేపు నిలబడిపోయారు ఇద్దరూ.

కార్లో ప్రయాణం తాలూకు వివరాలన్నీ పూస గుచ్చినట్టు చెప్పి, "ఇంకోసారి నన్ను పిలవబాకురా నాయనా, నే చెప్పులా, నాకూ దూరప్రయాణానికీ పొసగదని, ఇది మొదటిసారి కాదుగా ఇట్టా అవడం, చిన్నప్పటినించీ ఇంతే, చివరికి ఈ పడమటింటి మహానగరానికి రావడానికి కూడా ఇంత కథయింది చూడు, అయినా ఈ సారి ఆ అబ్బాయి ధర్మమా అని ధైర్యం వచ్చిందిలే" అంది నవ్వుతూ.

"ధైర్యం వచ్చిందిగా. అయితే వచ్చే ఏడాది మళ్ళీ వద్దువుగానీలే అమ్మా " అన్నాడు సతీష్ కూడా నవ్వుతూ.

Click here to share your comments on this story